# సత్య వాక్య

# THE WORD OF TRUTH

## రేడియో శ్రీలంక ద్వారా క్రీస్తు సంఘముల
## సువార్త ప్రసారములు

**తెలుగు — SATYA VANI**

ప్రతి ఆది, మంగళ, గురు, శుక్ర, శనివారాల్లో
మధ్యాహ్నం గం 2-30 కు

**ఇంగ్లీషు — THE VOICE OF TRUTH**

| | |
|---|---|
| సోమవారము<br>బుధవారము | 9-00 to 9-15 p. m. |

**హిందీ — SATYA SUSAMACHAR**

| | |
|---|---|
| మంగళవారము<br>గురువారము<br>శుక్రవారము | 9.00 to 9-15 p. m. |
| ఆదివారము | 1-30 to 1-45 p. m. |

**తమిళం — SATYA VAZHI**

| | |
|---|---|
| మంగళవారము | 5-30 to 5-45 p. m. |
| గురువారము<br>శుక్రవారము | 6-45 to 7-00 p. m. |

**మలయాళం — THE VOICE OF TRUTH**

| | |
|---|---|
| మంగళవారము<br>శుక్రవారము | 3-45 to 4-00 p. m. |

ఈ కార్యక్రమములను అందరు వినండి. అందరికీ విన్పించండి. తెలుగు, ఇంగ్లీషు భాషలలో లభ్యమగు ఉచిత బైబిలు కరస్పాండెన్సు కోర్సులలో చేరండి. ఒక క్రొత్త నిబంధనను ఉచితంగా పొందండి. ఈ రోజే మాకు వ్రాయండి:

**SATYA VANI**
P.O. Box. 80
KAKINADA – 533 001

# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

**P. O. Box 80, KAKINADA-533 001.**

*Editor* J. C. CHOATE

*Managing Editor* JOSHUA GOOTAM

Pleading for restoration of pure New Testament Christianity.

సంచిక **1** ఆగస్టు **1982** సంపుటి **3**


## సంపాదకీయము

### నీవొక క్రైస్తవునిగా మాత్రం ఉండవచ్చును

*(You can be just a Christian)*

నీచుట్టు చూచునప్పుడు వివిధ గుంపులవారు మత సంబంధమైన వివిధ నామములను ధరించుకొని యుండుట నీవు కనుగొందువు. ప్రతి సంఘము క్రీస్తుకు చెందినదని వారు చెప్పుకొందురు గాని వారు ఒకరి నొకరు వ్యతిరేకించుదురు, వివిధ సిద్ధాంతములను బోధింతురు, వివిధ ములుగా ఆరాధింతురు, వివిధ పేర్లతో పిలువబడుదురు. ఇదంతయు చాల గజిబిజిగా మనకు కనబడును. వీరిలో యెవరు రైటు? ఒకడు ధరించవలసిన నామమేది? క్రీస్తును వెంబడించుచున్నామని చెప్పుకొను వారందరు ఆయనను వెంబడించుటలేదని దయచేసి జ్ఞాపకముంచు కొనుము. గనుక నీవు నిజంగా దేవుని చిత్తమును తెలిసికొనగోరు చున్నట్లయితే, ఆయనకు లోబడగోరుచున్నట్లయితే నీవేమై యుండా

లని ఆయన కోరుచున్నాడో అట్లుండగోరుచున్నట్లయితే, నీవు సత్యమును వెదుకవలసియున్నది.

దేవుడు తన వాక్యమును మనకిచ్చెనని నీవు గ్రహించాలి. ఆ వాక్యములో మరి ముఖ్యముగా క్రొత్త నిబంధనలో మానవజాతి కంతటికి ఆయన తన చిత్తమును బయలు పరచెను. ఆయన లోకము నెంతో ప్రేమించి తన ఏకైక కుమారుని దాని కొరకు అనుగ్రహించెను అని మనకు చెప్పబడియున్నది (యోహాను 3:16). మానవుడు పాపములోబడి నశించిపోవుచు నిరీక్షణ లేనివాడుగ యుండెను. (రోమా 3:23; 6:23). మనమింకను పాపులమై యుండగనే ఈలోక పాపముల నిమిత్తము బలిగా క్రీస్తు సిలువపై చనిపోయెను (రోమా 5:8). ఇంకో మాటలో, ఆయన మన పాపముల నిమిత్తము బలి ఆయెను, మనపాపములు క్షమింపబడే అవకాశము కల్పించు నిమిత్తము బలి ఆయెను (ఎఫెసీ 1:7). అట్టి రక్షకుని చూపించగలిగే మతం ఇంకొకటి ఏమియు లేదు. మానవుడు చేసిన పాపములన్నిటిని క్షమించగలిగే మార్గాన్ని చూపించగలిగే మతం ఇంకొకటి ఏమియు లేదు. క్రీస్తు విశ్వాసులలో కూడ మానవుల బోధను అనుసరించుచు, డినామినేషన్లలో సభ్యులై యుండి, దేవుడాజ్ఞాపించని విధంగా ఆయన్ను ఆరాధించి సేవించాలను కొనేవారికి క్షమాపణ లేదు. ప్రతీది చేయుటకు రైటయినది రైటు కానిది మార్గమొకటి యున్నది, ప్రభువుమార్గము ఒక్కటే రైటు. "నేనే మార్గమును, సత్యమును, జీవమును, నాద్వారానే తప్ప యెవడును తండ్రియొద్దకు రాడు" అని యేసుచెప్పెను (యోహాను 14:6).

క్రీస్తుయొక్క మరణసమాధి పునరుత్థానములనుగూర్చి ప్రభువు వాక్యము మనకు బోధించుచున్నది. మనం ఆయనకు విధేయులగుటలో మన పాపముల విషయమై మృతిబొందుదుమని, బాప్తిస్మపు నీటిలో ఆయనతోకూడ పాతిపెట్టబడుదుమని, నూతన జీవితంలో నడుచుకొనుటకు దానినుండి తిరిగి లేచెదమని మనకు బోధింపబడి యున్నది

(రోమా 6). క్రీస్తు ఇట్లనెను: "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మనివానికి శిక్ష విధింపబడును" (మార్కు 16:16). మనం ప్రభువుకు చూపించే విధేయత ఒక క్రొత్తజన్మ యని క్రీస్తు చెప్పెను. సంఘమైన ఆయన రాజ్యములో ప్రవేశించుటకు ఒకడు నీటిమూలముగను (బాప్తిస్మముద్వారా) ఆత్మమూలముగను (ఆయన వాక్యోపదేశముద్వారా) తిరిగి జన్మించాలని ఆయన బోధించెను (యోహాను 3:3-5; అపొ. కా. 8:38, 39; 1 పేతురు 1:22-25; 1 కొరింథి 12:13).

క్రీస్తు తన సంఘమును కట్టుటకు వాగ్దానము చేసెనని, దానిని ఆయన క్రీ॥ శ॥ 33వ సంవత్సరములో, యెరూషలేములో పెంతెకొస్తు నాడు అపొ. కా. 2వ అధ్యాయము ప్రకారము కట్టెనని లేఖనములు మనకు చెప్పుచున్నవి. ఆయన ఒకే సంఘమును స్థాపించెను (మత్తయి 16:18). దానికొరకే ఆయన చనిపోయెను (ఎఫెసీ 5:25), దానినే ఆయన తన స్వరక్తమిచ్చి కొనెను (అపొ. కా. 20:28), దానికే ఆయన రక్షకుడు (ఎఫెసీ 5:23), దానికే ఆయన శిరస్సు (కొలస్స 1:18), ఆయన పేరునే అది ధరించుకొనును (1కొరింథి 12:27; రోమా 16:16; అపొ. కా. 11:26), క్రీస్తుకు విధేయులైన వారిని ఆయన రక్షించును, వారిని ఆయనే తనసంఘమందు చేర్చును (అపొ. కా. 2:38, 47).

దేవుని ప్రజలు ఆయనను ఆత్మతోను సత్యముతోను, అంటే నిష్కపట హృదయముతోను, వినయముతోను, ఆయన వాక్యప్రకారము ఎట్లారాధించవలెనో ఆయన గ్రంథము మనకు బయలుపరచుచున్నది (యోహాను 4:24). ప్రభువు నారాధించుటలో క్రైస్తవులు ప్రతి ఆదివారమున కూడుకొందురు (అపొ. కా. 20:7), వాక్యపఠనము చేయుదురు (2 తిమో 2:15), ప్రార్థింతురు (అపొ. కా. 2:42), పాటలు పాడుదురు (వాద్యములు వాయించరు) (ఎఫెసీ 5:19), ప్రభురాత్రి భోజనంలో పాల్గొందురు (మత్తయి 26:26-28) మరియు కానుకల నిత్తురు (1 కొరింథి 16:2).

క్రైస్తవ జీవితాన్ని మనం ఎట్లు జీవించాలో క్రొత్త నిబంధన వివరించుచున్నది. క్రీస్తు మన మాదిరియై యున్నాడు గనుక మనం ఆయన అడుగు జాడలలో నడచుకొనవలెను (1 పేతురు 2:21). ఆయన మన ఉపదేశకుడు. మనం ఎల్లప్పుడు రైటయిన దానినే చేయాలని, దుర్మార్గతను అవినీతిని విసర్జించాలని, ఒకరినొకరు ప్రేమించాలని, ప్రజలందరికి మేలుచేయాలని ఆయన మనకు బోధించుచున్నాడు (మత్తయి 22:36-39; మత్తయి 5:16; 6:33; లూకా 9:23). ప్రభువుకు నమ్మకముగా యున్నవారు ఈలోకంలో ఆత్మీయాశీర్వాదములను గూర్చిన వాగ్దానమును మాత్రమేగాక (ఎఫెసీ 1:3), రాబోవు లోకంలో ప్రభువుతో నిత్యము జీవించే నిరీక్షణ కలిగియున్నారు (ప్రకటన 2:10; 22:14). నేటి లోకంలో ఒకడు జీవించదగిన ఒకే ఒక్క ఉత్కృష్ట జీవితం యిది.

నామిత్రుడా, ఆయన తన వాక్యంలో చెప్పిన దానిని నీవు చేసినట్లయితే, నీవొక క్రైస్తవునిగా మాత్రం యుండగలవు, ప్రభువు సంఘసభ్యునిగా యుండగలవు, ప్రభువు నిన్ను గూర్చి యేమికోరుచున్నాడో అట్లుండగలవు, ఆయన దీవెనలు, వాగ్దానములు పొందగలవు. క్రీస్తుకు లోబడుటద్వారా నీవు రక్షింపబడగల్గునప్పుడు మానవోపదేశముల ననుసరించి, బైబిలునందు కనబడని సంఘములో యుండి, మానవ కల్పితనామమును ధరించి నీ ఆత్మను అపాయకరమైన స్థితిలో ఎందుకు ఉంచాలి? ప్రభువునకు లోబడుము, తన సంఘములో ఆయననే నిన్ను చేర్చునీయుము (మార్కు 16:16; అపొ. కా. 2), సమస్తము ఆయన నామమును బట్టియు, అధికారమును బట్టియు చేయుము (కొలస్స 3:17; మత్తయి 28:18). ప్రభువుకు లోబడువారు మాత్రమే క్రైస్తవులని, వారు మాత్రమే రక్షింపబడుదురని, ఆయనకు లోబడని వారు నశింతురని జ్ఞాపకముంచుకొనుము. నీవు సరియైన నిర్ణయాన్ని గైకొని, ప్రభువుమార్గము ననుసరించి నడచుకొనుటకు ఎంచుకొందువని నా ప్రార్థన.

★

# క్రీస్తుసంఘము యొక్క ఘనత

## *(The Greatness of the Church of Christ)*

ఈలోకంలో అనేక గొప్ప సంస్థలున్నవి. అవి వ్యాపార, రాజకీయ, దానధర్మ, మత సంస్థలు. అయితే సంఘము ఏకైకమైనది, నేడు లోకంలోయున్న సంస్థలన్నిటికంటె అది గొప్పది. దానిలో సభ్యుడై యుండుట ఒక భాగ్యము. వ్యాపార రాజకీయ సంస్థలు పలువిధములుగా సేవచేసి ప్రజలకు సహాయపడవచ్చును. గాని వాటిద్వారా కలిగే లాభము భౌతికమైనది, ఈ జీవితంలో కొద్ది సంవత్సరములపాటు మాత్రమే యుండును. అయితే క్రీస్తు సంఘము క్రీస్తు స్వంతసంస్థయై యున్నది. అది భౌతిక, ఆత్మీయ, నైతిక దీవెనల నిచ్చును. ఇవి నిత్యము ఉండును. ఇంకేది ఆశీర్వదించని విధంగా అది మానవులను ఆశీర్వదించును. మన రక్షకుడు శిరస్సుగాయున్న ఆయన సొంత సంస్థలో యుండుట ఆశ్చర్యము! (ఎఫెసీ 1:22, 23; కొలస్స 1:18).

## క్రీస్తు సంఘమునకు దైవిక నిర్మాణికుడు కలడు

క్రీస్తు వచ్చుట, ఆయన సంఘము స్థాపింపబడుట దేవుని నిత్య సంకల్పము చొప్పున జరిగెను (ఎఫెసీ 3:10, 11). భూసంస్థలన్నియు మానవాలోచన ప్రకారము ఉద్భవించెను గాని క్రీస్తు సంఘము దేవుని ఆలోచనప్రకారము ఆయన నిత్యసంకల్పము ప్రకారము ఉద్భవించెను. డినామినేషన్లుకూడా మత సంస్థలే అయినను, సంఘముతో సంబంధము కలిగియున్నట్లు ఆరోపించుకొనుచుండినను, ఇవి ఒక మానవుని ఆలోచన ప్రకారము, లేక కొంతమంది ఆలోచన ప్రకారము ఉద్భవించెనని ఒప్పుకోక తప్పదు. అవి దేవుని సంకల్పములో మాత్రము లేవు. వాటిని స్థాపించిన మానవుల తలంపు ప్రకారము అవి ఉద్భవించెను గాని ఒకే సంఘమును సంకల్పించిన దేవుని తలంపు ప్రకారముకాదు.

## క్రీస్తు సంఘమునకు దైవిక స్థాపకుడు కలడు

పేతురు ఒప్పుకొనినది క్రీస్తును (మత్తయి 16:16). ఆయన "నాసంఘమును కట్టుదును" అని చెప్పెను. క్రీస్తే ఆ బండ, పునాది రాయి దానిపై సంఘము నిర్మించబడింది (యెష 28:16; 1 కొరింథి 3:11; 10:4), గాని చిన్న రాయి అగు పేతురుపై కాదు. అయితే కట్టిన వాడెవడో గమనించుట అవసరము. "నా సంఘమును కట్టుదును" అని చెప్పినప్పుడు క్రీస్తు సంఘములు అని బహువచనమును ఆయన ఉపయోగించలేదు గాని సంఘము అని ఏకవచనమునే ఆయన ఉపయోగించెనని గమనించుము. నా సంఘము అని ఆయన వాడిన పదములను గమనించుము. దానిని కట్టింది ఆయనే. అది ఆయనకు చెందును. డినామినేషన్లను మానవులు కట్టారు.

## క్రీస్తు సంఘము దైవిక విలువ నిచ్చి కొనబడింది

కుమారుడైన దేవుడు పరలోకమునువీడి సిలువవరకు వెళ్ళి ఆయన తన స్వరక్తమిచ్చి సంఘమును కొనెను (అపో. కా. 20:23). ఆయన సంఘమును ప్రేమించి దానికొరకు తన్నుతాను అర్పించుకొనెను (ఎఫెసీ 5:25). సంఘము మన రక్షకుని రక్తపు విలువకు తగినదయితే దానిని కించపరచనెంచగలిగిన వాడెవడు? మానవకల్పిత సంఘములను, సంస్థలను దానితో పోల్చదగిన వాడెవడు? దేవుడు యూదులనేమి, అన్యజనులనేమి మానవులందరిని తనకొరకు సమాధాన పరచుకొను ఒకే ఒక్క శరీరము, ఒకే సంఘమున్నది (ఎఫెసీ 2:16). దేవుడొక్కడే యను భావముతోనే ఒకే ఒక్క శరీరము ఒకే ఒక్క సంఘమున్నది (ఎఫెసీ 4:4-6). ఒకే దేవుని కంటె ఎక్కువ మందిని కలిగి యుండుట ఎంత లేఖనార్థమై యుండునో ఒకటికంటె ఎక్కువ సంఘములను కలిగి యుండుటకూడ అంత లేఖనార్థమై యుండును!

హిమాచల్ ప్రదేశ్ లో ఒక బోధకుడు 'ఆసియాలోని ఏడు సంఘముల
సంగతి యేమని ?' అడిగి, ఎక్కువసంఘము లుండవచ్చునని నిరూపించ
బోయాడు (ప్రకటన 1:4). జాగ్రత్తగా చదువు వాడెవడైనను అవి
ఏడు డినామినేషన్లు కాదుగాని ఏడు వివిధ స్థలములలో యున్న
ప్రభువు సంఘమేయని గ్రహించగలడు. ఈలోకము నమ్మునట్లు తన
అనుచరులు ఏకమై యుండవలెనని క్రీస్తు ప్రార్థించిన సంగతిని ఎరిగి
యుండియు మానవులు మతశాఖల విభజన నెందుకు సమర్థిస్తారు ?
(యోహాను 17:20-21). మీలో కక్ష లుండకూడదు. క్రీస్తు విభ
జింపబడి యున్నాడా ? యని పరిశుద్ధాత్ముడు పౌలుద్వారా హెచ్చ
రించెనుగదా ? (1 కొరింథి 1:10-12). మానవులందరు తమ మానవ
కల్పిత డినామినేషన్లను, మానవకల్పిత మతనామములను ప్రమాణము
లను విసర్జించి క్రీస్తుకును ఆయన సంఘమునకును తిరిగి రావలెను.
ఇదియే సరియైనది. ఇది తప్పు కానేరదు. బైబిలు బోధించు విధా
నమే యిది.

సంఘసభ్యులు భూమిమీదనున్న ఈ గొప్ప సంస్థకు చెందిన
వారని, దానిలో ప్రాముఖ్యమైన భాగము వారేనని గ్రహించినప్పుడు,
దానిని వారు మాటలతోను, ధనముతోను పైకెత్త జూతురు. అమెరి
కన్ సంఘశాఖనుగాని, కెనడా సంఘశాఖనుగాని, బ్రిటిషు సంఘ
శాఖనుగాని పైకెత్తుట కాదుగాని క్రీస్తు స్వంత సంఘమునే పైకెత్తు
చున్నామని గమనింతురు. అది బోధకుని సంఘమనిగాక క్రీస్తు సంఘ
మని, వారు దానిలో ప్రాముఖ్య భాగస్థులని వారు తలంతురు. సంఘ
ములో తరతరములు దేవునికి సదాకాలము మహిమ కలుగవలెను
(ఎఫెసీ 5:27; 1 కొరింథి 15:23-26).

—చార్లెస్ స్కాట్.

యేసును వెంబడించిన పండ్రెండుగురు-5

# ఫిలిప్పు : దయగలవాడు

## (Philip: The Kind One)

క్రీస్తుతో ముఖాముఖిగా సంచరించుటవలన ఫిలిప్పు మంచి వాడుగా తయారయ్యెను. అతని జీవితాన్ని చదువుటలో అనేక సవాలులను మనం ఎదుర్కొందుము.

### శిష్యుడగుటకు సవాలు

క్రీస్తు ఫిలిప్పును పిలిచినప్పుడు అనేక తరుణములతో కూడిన జీవితం అతనికి లభించినది. సంఘపు నాదిలో ఒకభాగముగను, ప్రపంచ ప్రఖ్యాతిలో జరిగె ఏకైక సంఘటనకు సాక్షిగను, పరలోకములో బంధించుటకు, విడిపించుటకు శక్తిగలవానిగను తానగుదునని ఫిలిప్పు ఎన్నడు ఆలోచించి యుండలేదు. అనేకసార్లు తరుణం మనకు లభించి నప్పుడు దానిలో భద్రతకొరకు వెదుకుచు, విఫలుల మధ్యే వరకు సంశయిస్తు మనం ఉంటాము. ఫిలిప్పుతో అట్లుకాదు. అతడు పిలువ బడినప్పుడు, మెస్సీయను కనుగొంటినని అతనికి నమ్మకం కలిగినప్పుడు అతడు జీవితకాల శిష్యుడాయెను. పేతురు, అంద్రెయలనుండి, బహుశ బేత్సయిదానుండి క్రీస్తు యిచ్చిన ఆహ్వానమునకు అతడు స్థిరపరచ బడెను (యోహాను 1:44). మరల ధర్మశాస్త్రమును, ప్రవక్తల గ్రంథ ములను చదువుటవలన అతడు క్రీస్తు పిలుపునకు సిద్ధపరచబడెను.

ఫిలిప్పు వెంటనే నతనియేలును వెదకి అతని క్రీస్తునొద్దకు తెచ్చుటలో యితరుల యెడల యథార్థమైన ఆసక్తిగలవాడని గోచర మగుచున్నది. నజరేయుడైన యేసులోగల స్వయం బయల్పాటును గూర్చి ఫిలిప్పు ఎంతవరకు నమ్మాడంటే అతడు నజరేతునుండి మంచి యేమైనా వచ్చునా? యని ఇక వాదించలేదు. కాని "వచ్చి

చూడుము" అని అతడు నతనియేలుకు చెప్పెను. ఆయన వచ్చిచూస్తే చాలు. అది అన్నివిధములను పరిష్కరిస్తుంది, ఆయన్ను బయలు పరస్తుంది. ఫిలిప్పు జీవితంద్వారా సువార్త పని ఎక్కడ ఆరంభమగునో మనం చూడగలము.

## క్రీస్తుతో ఎదుగుటకు సవాలు

ఫిలిప్పు ఎదుట ఇంచుమించు ఆకలిగొనిన అయిదువేలమంది ఉన్నారు. వారు అతని ఆత్మీయాభివృద్ధిని కొలిచే కొలబద్దగా తయారైయ్యారు. ఈజనసమూహమునకు ఆశ్చర్యకరంగా ఆహారాన్ని పెట్టుటలో ఫిలిప్పును ఆయన "పరిశోధింప" గోరెను. ఇంతమందికి ఆహారాన్ని పెట్టుట ఎట్లోయని ఫిలిప్పు లెక్కలు కట్టుచుండగా బహుశ యేసు అతనిని గమనించ యుండవచ్చును (యోహాను 6:5). వీరందరికి అద్భుతంగా ఆహారాన్ని పెట్టినవ్యక్తినిగూర్చి యిప్పుడతడు ఆత్మీయ లెక్కలు కట్టాలని బహుశ యేసు ఆశించి యుండవచ్చును. ఆకలిగొన్న వారి బాధను గమనించ గలుగుటలో ఫిలిప్పుయొక్క మంచితనము, జాలిగల హృదయం గోచరమగుచున్నది, యితరుల అవసరములను గూర్చి నిశ్చింతపరులుగ మనలను తయారు చేయుటకు నేటి సమాజంలో ఎంతోయుంది. అట్టి శక్తులకు గురికాకుండా మనం చూచుకొనాలి.

యేసు సిలువవేయబడక కొన్నిరోజులముందు యూదామతంలోనికి మార్పుజెందిన గ్రీసుదేశస్థులు కొందరు యేసును చూడగోరిరి. వారు ఫిలిప్పుకు తమ కోరికను తెలియపరచిరి. గలిలయలో, ప్రాముఖ్యముగా బేత్సయిదా, దెకపొలి ప్రాంతములలో గ్రీకులు పెక్కుమంది యుండిరి. బహుశ వారిలో కొందరు ఫిలిప్పును ఎరిగి యుండవచ్చును లేదా అతని పేరు గ్రీకుని పేరని గుర్తు కట్టియుండవచ్చును. అందువలన అతనిద్వారా క్రీస్తు దగ్గరకు చేరే అవకాశాన్ని వారు పొందగలమని యనుకొనిరి. ఫిలిప్పు దగ్గరకుపోయి మనవిచేసుకొంటే అతడు మన

మనవి నాలకించునని వారనుకొనుటలో ఫిలిప్పు యొక్క దయగల స్వభావము వ్యక్తమగుచున్నది. అప్పుడతడు అంద్రెయకు చెప్పెను. యొప్పేలో ఒక యింట మిద్దె మీద పేతురును గజిబిజి చేసే సమస్యను వారిద్దరు ఇప్పుడు ఎదుర్కొనిరి (అపొ. కా. 10:9-1 ). ఇశ్రాయేలులో వెనుక బడిన గొర్రెల యొద్దకు పంపబడిన ఆయనకు ఈ గిలిలయులను పరిచయము చేయవచ్చునా ? వారు ఈ గ్రీకులను యేసుకు పరిచయం చేసి ఒక గొప్ప పాఠాన్ని నేర్చుకొన్నారు. సత్యమును వెదకువాడు సమరయుడేమి, గ్రీకువాడేమి, యూదుడేమి ఎవడైననుసరే అతనితో సంభాషించ డానికి యేసు వెనుదీయలేదని వారు గ్రహించిరి (యోహాను 12:20-24).

## యేసులో దేవుని చూచే సవాలు

యేసు తను 12 మంది శిష్యులను విడిచి వెళ్ళిపోబోవుచున్నానని వారితో చెప్పినప్పుడు వారిలో కొందరు వివిధభావములను వ్యక్తపరచిరి. పేతురు ఆయన్ను వెంబడించాలనుకొన్నాడు. తోమా ఆయన వెళ్లే చోటుకు మార్గము తెలిసికో గోరాడు. ఫిలిప్పయితే దేవుని మాకు చూపించుమని కోరాడు. కనబడేలాగున దేవుని చూడ గోరుటలో అతడు స్వల్ప విశ్వాసివలె కనబడుచున్నను, యేసు ఒక్కడే దేవుని కనబరచగలడని అతడు నమ్ముటలో గొప్ప విశ్వాసాన్ని వ్యక్తపరచెను. దేవుని లక్షణములైన దయ, పవిత్రత, సత్యము, న్యాయము, ప్రేమ మొదలగున వన్నియు మొదట ఫిలిప్పును పిలిచిన నాటినుండి ఆయనలో కనబడుచున్నందున, నేనే దేవుని బయల్పాటునని క్రీస్తు అతనికి జవాబిచ్చెను. "నన్ను చూచినవాడు తండ్రిని చూచియున్నాడు" (యోహాను 14:9). నిజానికి దేవుని మహిమను గూర్చిన జ్ఞానము యేసుక్రీస్తునందు వెల్లడి పరుపబడింది (2 కొరింథీ 4:6).

తదుపరి ఫిలిప్పు జీవితము శక్తితోను ఆత్మీయ విజయముతోను నిండిపోయింది. అతడు ఆసియాలో తన కృషిని కేంద్రీకరించినట్లు

చారిత్రక సాంప్రదాయము వలన తెలియుచున్నది; బహుశ ఫ్రిగియలో అతడు పనిచేసి యుండవచ్చును. అతడు హీరాపొలియలో హాత సాక్షిగా మరణించెను. క్రీస్తుకొరకు జయింపబడిన అతడు ఆత్మలను జయించేవాడాయెను. యితరుల అవసరం నిమిత్తము దేవుని అమితమైన సృష్టి శక్తిని, దయను ఎరిగినవాడతడు. దయగల హృదయంతో యితరులు యేసును చూడగల్గునట్లు చేసినవాడతడు. విశ్వాసము ద్వారా యేసే దేవుని బయల్పాటని, దేవుని కుమారుడని, దేవుడని ప్రకటించిన వ్యక్తి అతడు.

—ఓటిస్ హిల్‌బర్న్

---

సంక్షిప్త ప్రసంగము :

## యేసు, ప్రార్థించు రక్షకుడు

### *(Jesus, A Prayerful Saviour)*

లూకా 22:39-46; హెబ్రీ 5:7

పరిచయము :

A) 1. యేసు ప్రార్థనలో ఎక్కువ కాలము గడిపెను.
2. ఆయన మనవలె శోధింపబడినను, పాపము లేకుండెను.
3. అందువలన ఆయన మన బలహీనతలయందు సహానుభవము కలిగియుండెను.
4. ఆయన కనికరముగలవాడు యథార్థవంతుడు, నమ్మకమైన ప్రధాన యాజకుడు (హెబ్రీ 4:14-16).

I ఆయన శరీరధారియైయున్నరోజులలో ప్రార్థించెను :

ఉదాహరణలు:

1. ప్రార్థన చేయుటకు ఆయన కొండఎక్కెను (మత్తయి14:22,23).

2. ప్రార్థనచేయుటకు అరణ్యములోనికి వెళ్లుచుండెను(లూకా5:16)
3. రూపాంతరము పొందిన కొండమీద ప్రార్థించెను ( లూకా 9:28-29).
4. పండ్రెండుమంది అపొస్తలులను నియమించకముందు ప్రార్థనలో రాత్రిగడపెను (లూకా 6:12, 13).

B) ఆయన అంతగా ప్రార్థనచేస్తే మనం ఇంకెంత చేయాలి?

1. మనము నిత్యము ప్రార్థన చేయుచుండవలెను (లూకా 18:1).
2. ప్రార్థనలో యెడతెగక యుండాలి (అపొ. కా. 2:42).
3. యెడతెగక ప్రార్థిస్తూ కృతజ్ఞతాస్తుతులు చెల్లించాలి (1 థెస్స 5:17,18).

## II గెత్సెమనెలో ఆయన 'నా చిత్తముకాదు నీ చిత్తమే సిద్ధించుగాక' యని ప్రార్థించెను:

1. ఆయన తండ్రిచిత్తమును నెరవేర్చుటకు వచ్చెను (యోహాను 6:38; 4:34).
2. దేవుని చిత్తమునకు లోబడుచు ఆయన బాప్తిస్మము పొందెను (మత్తయి 3:13-17).
3. భూమిమీద ఆయన చిత్తము నెరవేరుగాకయని ప్రార్థించుడని తన శిష్యులకు నేర్పించెను (మత్తయి 6:10–13).
4. ఆయన ఆత్మను కనబరచువారమైతే, తండ్రిచిత్తము నెరవేరునట్లు మనము ప్రార్థింతుము ( 1 యోహాను 5:14; సామె28:9; యాకోబు 4:1).

## III యేసు తన శత్రువులకొరకు ప్రార్థించెను:

1. సిలువపై (లూకా 23:34).
2. ఆయన శిష్యులు శత్రువులను క్షమించాలి, వారి కొరకు ప్రార్థించాలి (మత్తయి 5:43-48; రోమా 12:14-19; మత్తయి 6:14-15). ఉదా: స్తెఫను - అపొ. కా. 7:60.

## IV యేసు పరమందుండి ప్రార్థించుచున్నాడు :

1. ఆయన మనకొరకు విజ్ఞాపన చేయుచున్నాడు (రోమా 8:34; హెబ్రీ 7:25).

 a) ఆయన మన మధ్యవర్తి (1 తిమో 2:5).

2. మన అపరాధములను ఒప్పుకొనిన యెడల, ఆయన క్షమించును (1 యోహాను 1:9; అపొ. కా. 8:22; లూకా 18:9-14).

ముగింపు :

1. యేసును అనుకరించు - ప్రార్థనలో గడుపు.
2. క్రైస్తవ జీవితంలో విజయం సాధించు.

—A. R. హిల్.

---

# పరలోక ప్రార్థన

## *( The Lord's Prayer )*

క్రీస్తు సువార్త బోధించుట కారంభించిన మొదటి సంవత్సరములో పరలోక రాజ్యము సమీపించి యున్నదని ప్రకటించెను (మత్తయి 4:17). తరువాత 'నీ రాజ్యము వచ్చుగాక' యని ప్రార్థించుడని ఆయన తన శిష్యులకు నేర్పించెను (మత్తయి 6:10). కొంతకాలమైన తరువాత, దేవుని రాజ్యము బలముతో వచ్చుట చూచేవరకు వారిలో కొందరు మరణించరని ఆయన తన అపొస్తలులకు చెప్పెను (మార్కు 9:1). తరువాత అపొ. కా. 2వ అధ్యాయములో పెంతెకొస్తు ఆదివారంనాడు ఇంచుమించు మూడు వేల మందితో రాజ్యము స్థాపించబడెను (అపొ. కా. 2:36-41). అది యెరూషలేము పట్టణంలో జరిగెను.

లేఖనార్థములైన ఈ వాస్తవములను బట్టి 'పరలోక ప్రార్థన' అని పిలువబడే దానిని గూర్చిన ప్రశ్న మనకు రావచ్చును. మత్తయి 6:9-13 లోను, లూకా 11:24 లోను కనబడు ఈ ప్రార్థన నిజానికి యేసు తన శిష్యులకు నేర్పిన ఒకమాదిరి ప్రార్థన. యేసు చనిపోయి సమాధి చేయబడి తిరిగి లేపబడకముందు, ఇంచుమించు రెండువేల సంవత్సరముల క్రితం పెంతెకొస్తునాడు ఆయన రాజ్యము స్థాపింపబడకముందు ఆయన వారికీ ప్రార్థన నేర్పించెను.

పరలోక రాజ్యము స్థాపించబడిన తరువాత దానిలోనికి శిష్యులు ప్రతినిత్యము చేర్చబడుచుండిరి. ఇందునుగూర్చి తండ్రియైన దేవుడు "మనలను అంధకార సంబంధమైన అధికారములో నుండి విడుదలచేసి, తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్య నివాసులనుగా చేసెను" అని వ్రాయబడి యున్నది (కొలస్స 1:13).

యెరూషలేములో ఈ రాజ్యము స్థాపించబడిన తరువాత ఆ పట్టణమునకు ఇంచుమించు 35 మైళ్ళ దూరములో, సమరయలో ఫిలిప్పు బోధించుచున్నట్లు మనం చూడగలము. అక్కడి ప్రజలు "ఫిలిప్పు దేవుని రాజ్యమును గూర్చియు యేసుక్రీస్తు నామమును గూర్చియు సువార్త ప్రకటించుచుండగా వారతని నమ్మి పురుషులును స్త్రీలును బాప్తిస్మము పొందిరి" యని చదువగలము (అపొ.కా. 8:12). వారు విశ్వసించి ఒక డినామినేషన్‌లో చేరవలెనని, నీరాజ్యము వచ్చుగాక యని ప్రార్థించాలని ఫిలిప్పు వారికి బోధించలేదని గమనించుము. మరల, అతడు పసిబిడ్డల కెవరికీ బాప్తిస్మ మియ్యలేదని గమనించుము. ఫిలిప్పు దేవుని రాజ్యము యేసుక్రీస్తు నామము ఆ ప్రజలకు బోధించగా పురుషులు స్త్రీలు నీటిమూలముగను, ఆత్మమూలముగను రాజ్యములోనికి తిరిగి జన్మించిరి (యోహాను 3 : 1-5). ఎవరైతే నమ్మి బాప్తిస్మము పొందగలరో వారికే క్రొత్త జన్మ (మార్కు 16 : 15, 16).

ఆ పెంతెకొస్తు నాటినుండి క్రొత్త నిబంధనలో శిష్యుడెవడును నీ రాజ్యము వచ్చుగాక యని ప్రార్థించలేదు, అట్లని బోధించలేదు. ఎందువలన ? రాజ్యము పెంతెకొస్తునాడు బలముతో వచ్చినందువలన (మార్కు 9:1; అపొ.కా. 2:1-4). మొదటి శతాబ్దములో క్రైస్తవులైన హెబ్రీయులు రాజ్యమును పొంది, పంచుకొని, అనుభవించుచుండిరి. "అందువలన మనము నిశ్చలమైన రాజ్యమును పొంది దైవకృప గలిగియుందము" అని వారికి చెప్పబడెను (హెబ్రీ 12:28).

మత్తయి 6:9-13 లో చెప్పబడిన దొక మాదిరి ప్రార్థన గనుక 'నీ రాజ్యము వచ్చుగాక' యని ఇప్పుడు ప్రార్థించుట తప్పు. పురుషులు స్త్రీలు రాజ్యమును ఇప్పుడు వెదకవలెను (మత్తయి 6:33). వారు బాధ్యత యుక్త విశ్వాసులవలె దానిలోనికి నీటి మూలముగను, ఆత్మ మూలముగను తిరిగి జన్మించినప్పుడు, అది మానవులలో వ్యాప్తి జెందాలని వారు దానిని గూర్చి ప్రార్థించవలెను.

—జిమ్ వాల్డ్రిన్.

---

## కయీను మార్గము

"వారు కయీను నడచిన మార్గమున నడిచిరి, బహుమానము పొందవలెనని బిలాము నడచిన తప్పుత్రోవలో ఆతురముగా పరుగెత్తిరి" (యూదా:11). హేబెలు అర్పించిన అర్పణము దేవునికి ఇష్టమైనందున కయీను తన తమ్ముని హత్య చేసెను. గనుక ఏకాలమందైనను కయీను మార్గము దేవునికి వ్యతిరేకమే. ఈమార్గము నేడు లోకమందు ప్రబలియుండుటచేత ప్రభువు చూపిన మార్గము మానవులకు కనబడుటలేదు.

"ఒకని యెదుట సరియైనదిగా కనబడు మార్గముకలదు: అయితే తుదకు అది మరణమునకు త్రోవతీయును" అని జ్ఞానియైన సొలొ

మోను చెప్పెను (సామె 14:12). ప్రపంచమందు క్రైస్తవులమని చెప్పుకొనుచున్నవారు తమ యిష్టానుసారమైన పేర్లతోను, పద్ధతుల తోను జనులను వంకర త్రోవలకు ఈడ్చుకొనిపోవుట విచారకరము. దేవుడేర్పరచిన సంఘమును విడచి మనుష్యులు తమ యిష్టానుసార మైన మార్గములకు తొలగిపోవుట చివరికి నాశనమే. సాతాను వారి హృదయములను బలముగా మూసివేసినది. ఈ యుగ సంబంధమైన దేవత అవిశ్వాసమైన వారి మనో నేత్రములకు గుడ్డితనము కలుగజేసె నని పౌలు వ్రాసెను (2 కొరింథి 4:4).

ఎంతమంది ఎన్ని పేర్లతో బోధించినను సుస్థిరమైన క్రీస్తు సంఘము ప్రత్యేకముగా ప్రపంచమునకు ప్రత్యక్ష మగుచునేయున్నది. మీరు సత్యమును గ్రహించెదరు. సత్యము మిమ్ములను స్వతంత్రులనుగా చేయును (యోహాను 8:32). మత్తయి 16:18; అపొ 20:28 చదువుము. దేవుడు తన స్వరక్తమిచ్చి సంపాదించిన సంఘమే ముక్తికి మూలసూత్రం. వెంటనే క్రీస్తుసంఘమునకు పరుగిడుము. క్రీస్తు పేరుతో ప్రయాణము సాగించుము. క్రీస్తు రక్తముతో ముద్రింపబడి ఆత్మ తోను సత్యముతోను దేవుని ఆరాధించుము లేదా కయీనుముద్రయే నీకును ప్రాప్తి.

—D. అబ్రహాము, నడిపూడి.

---

## యేసుక్రీస్తుయొక్క మహాయజ్ఞము

హిందూ యను శబ్దము (పదము) దేశపరముగాని, మత పరముకాదు. సింధుయను శబ్దము రాను రాను హిందూ శబ్దముగా మారినది. మతమనగా మార్గమని యర్థము. మానవుడు మనో

వాక్కాయ కర్మలచేతను, కామ క్రోధ లోభ మద మాత్సర్యముల చేత పాపియగుచున్నాడు. పాపము బాపుకొనుటకు మానవుడు నిత్యము మార్గమన్వేషించుచున్నాడు. మానవకల్పిత మతములు మార్గములుకావు. అవి మరణమునకు దారితీయును. ఒకని మార్గము వానిదృష్టికి యథార్థముగా కనబడును. తుదకది మరణమునకు దారి తీయును (సామె 16:25; 14:12). యిర్మియా యిట్లు చెప్పుచున్నాడు: మార్గములలో నిలిచి చూడుడి పురాతన మార్గములనుగూర్చి విచారించుడి. మేలుకలుగు మార్గమేదియని అడిగి, అందులో నడచుకొనుడి. అప్పుడు మీకు నెమ్మదికలుగును (యిర్మి 5:16). యిట్టి మార్గముకొరకు కొందరు తపస్సులు పుణ్యకార్యములు చేయుదురు. పుణ్యక్షేత్రములు సందర్శింతురు.

నపుణ్యో - దానదర్మశ్చ - న, కర్మశ్చ
పుణ్యం, భవేత్ - నపుణ్యో - ప్రాణదానశ్చ
జగత్, పుణ్యం - నహీ నహీ.

దానధర్మముల వలనగాని, కర్మకాండలు ఆచరించుటవలనగాని మోక్షము కలుగదు. ప్రాణము దానము చేయుటవలననే మోక్ష ప్రాప్తికలుగును. ఇందుకై బ్రాహ్మణులు యజ్ఞములు చేయుదురు. శూద్రులు బలులు అర్పింతురు. మహమ్మదీయులు నమాజులు చేయుదురు. క్రైస్తవులు ప్రార్థనలు, ఆరాధనలు చేయుదురు.

ప్రథమాణి - ధర్మాణి - యజ్ఞః (ఋగ్వే 1:164-35). మోక్ష ప్రాప్తికి యజ్ఞములు ప్రథమ ధర్మములని చెప్పబడుచున్నవి. యజ్ఞో-వై భువ - నస్యనాభిః. యజ్ఞములు మోక్షము పొందుటకు ముఖ్యాధారములు. అనగా నాభిస్థానమువంటివి. యజ్ఞే - సర్వం - ప్రతిష్టతం. యజ్ఞములు సర్వమును అనుగ్రహించును.

యజ్ఞోవా-ఆపతి-తస్యఛాయా-క్రియతే (ఋగ్వే) యజ్ఞమే రక్షించును. దాని ఛాయయే జరుపబడుచున్నది.

ఆత్మదా-బలదాః-యస్య, ఛాయా - మృతం-యస్య మృత్యుః (ఋగ్వే 10-121-2). యెవనియొక్క మృత్యువు ఛాయయు, అమృతమగునో (రక్షించునో) అతని మరణము ఆత్మకు బలము నిచ్చును.

యజ్ఞమానః-పశుః. యజ్ఞమానమేన-సువర్ణ లోకం-గమయతి. (తైత్తిరీయ, బ్రాహ్మణం). యజ్ఞము చేయువాడే యజ్ఞ పశువు. వాడే స్వర్గలోకమేగును. ప్రజాపతే-ర్దేవేభ్యం-ఆత్మానాం యజ్ఞం-కృత్వా ప్రాయశ్చిత్ (తాండియ బ్రాహ్మణం). సృష్టికర్త తనకు తానే యజ్ఞం కావింపబడి ప్రాయశ్చిత్తముచేసి పరమున కేగు నందును. పురుషసూక్తమందలి విరాటపురుషుని యజ్ఞము యేసు క్రీస్తులో నెరవేరినది. అదెట్లనగా? మచ్చలేని మేక, దాని తలకు బలుసు కంప, దానికాళ్ళలో మేకులు కొట్టుట (రక్తము కారునట్లు), దాని శరీరముపై వస్త్రము కప్పుట, ఆ వస్త్రమును నల్గురు ఋత్విక్కులు పంచుకొనుట, దానికి సోమరసము పోయుట, దానికి ప్రాణప్రతిష్ట చేయుట (అనగా) తిరిగి బ్రతుకుటవంటి విరాట్పురుషుని యజ్ఞమందలి క్రియలన్నియు యేసుక్రీస్తు యొక్క మహాయజ్ఞములో నెరవేరినవి. మచ్చలేని అనగా పాపపు డాగు లేనివాడు ఏసుక్రీస్తు బలుసుకంపకు సూచనగా ముండ్ల కిరీటము, రక్తము కారునట్లు ఆయన కాళ్లు చేతులందు మేకులుకొట్టిరి. యేసునకుకూడా ఒక వస్త్రము తొడిగించిరి. ఆయనపై వస్త్రమును నల్గురు సైనికులు పంచుకొనిరి. దాహమని సిలువపై ఆయున. అడుగగా ఆయనకు చేదుచిరక నందించిరి. దానికి ప్రాణప్రతిష్ఠ చేసినట్లు యేసుప్రభువు మరణమును జయించి తిరిగి లేచి యున్నాడు. దానికి మేము సాక్షులమని ఆనాటి శిష్యులు సాక్ష్య మిచ్చిరి. యేసుక్రీస్తు ప్రాణము పెట్టుటకును, దానిని తిరిగి తీసుకొనుటకును ఆయనకు అధికారము కలదనెను (యోహాను 10:18). నేనే మార్గం సత్యం జీవమనెను (యోహాను 14:6). అన్ని నామములకంటె పై నామము కలవాడాయెనే (అపొ. కా. 4:12). నేను దేవుడనని

పైనుదహరించిన మహాయజ్ఞము చేసి యేసుక్రీస్తు తన్నుతాను ఋజువు పరచుకున్నాడు. యేసుక్రీస్తు ఆదియు, అంతమునై యున్నాడు.

సోదరా, యేసుప్రభువును గూర్చి నీవే మనుకొనుచున్నావు? ఆయన మాట్లాడినట్లెవరును మాట్లాడలేదు. ఆయన చేసిన అద్భుతముల వంటి వెవరును చేసియుండలేదు. ఇంద్రజాల మహేంద్రజాల విద్యలవంటివి ఆయన చేయలేదు. గాన ఆయనను నమ్మి బాప్తిస్మము పొందిన ప్రతివాడు రక్షింపబడును (మార్కు 16:16).

—ఎ. ఇశ్రాయేలు రాజు, కాకినాడ.

— ♦♦ —

## యోబునుండి గొప్ప పాఠములు

### *(Great Lessons from Job)*

మానవులను పట్టుకొనడానికి అపవాది విరామములేకుండ అటు యిటు తిరుగునని యోబు గ్రంథము మనకు బోధించు చున్నది. (యోబు 1:7; 2:2). యెవని మ్రింగుదునాయని అపవాది తిరుగుచున్నాడని పేతురు మనకు చెప్పుచున్నాడు (1 పేతురు 5:8). సంఘాభివృద్ధిని అరికట్టుటకు, నిరుత్సాహపరచుటకు సాతానుడు అనేక కుతంత్రములను వినియోగించునని పౌలు చెప్పుచున్నాడు (2కొరింథి 2:11). మందను నాశనము చేయుటకతడు బయటనుండి క్రూరమైన తోడేళ్ళను ప్రవేశింపజేయును. వారు అబద్ధబోధను బోధింతురు. అతడు అబద్ధబోధను బోధించుటకును మనుష్యులను తమ వెంట ఈడ్చుకొనిపోవుటకును సంఘనాయకులనే వినియోగించును (అపొ. కా. 20:28 - 31; 2 తిమో 4:3-5). ప్రభువును వదలి మనుష్యులను వెంబడించునట్లు అతడు క్రైస్తవులను గుంపులుగా శాఖలుగా విడదీయును (1 కొరింథి 1:10-13).

మానవుని వేదాంతము పనికిరాదని యోబు మనకు బోధించు చున్నాడు (యోబు 16:2, 3). మానవులు తమ ప్రవర్తనయందు సన్మార్గమున ప్రవర్తించుట వారి వశములో లేదని యిర్మీయా ప్రవక్త చెప్పుచున్నాడు (యిర్మీ 10:23). నీతి క్రియలను జరిగించుచు, పరిపూర్ణ మార్గములో పయనించేటట్లు మనకు బోధించేది దేవునిజ్ఞానము (1 కొరింథి 2:6-13; 2 తిమో 3:16, 17). అందువలన వితర్కములను, అహంకారమును పడద్రోయుడి యని పౌలు మనకు చెప్పు చున్నాడు ( 2 కొరింథి 10:5).

యోబు నిరూపించిన రీతిగా మనం ప్రభువునందు సంపూర్ణ విశ్వాసము కలిగియుండాలి (యోబు 42:1-6). పూర్ణ హృదయంతో మనం ప్రభువునందు నమ్మకముంచాలియని పురాతన కాలజ్ఞానులు కూడ తెలియ జేయుచున్నారు (సామె 3:5-7). బలము కొరకు మనము దేవునిపై ఆధారపడవలెనని ఇశ్రాయేలు గాయకుడు సూచించుచున్నాడు (కీర్తన 33:8-12). అందువలనే ఉద్రేకపూరిత స్వరంతో, "దేవుడు మనపక్షమున నుండగా మనకు విరోధి యెవడు?" అని పౌలు ప్రశ్నించుచున్నాడు (రోమా 8:31).

ఈ జీవితంలో మనలను కలవరపెట్టు ప్రశ్నలన్నిటికి యేసు క్రీస్తులో జవాబీయ బడెనని యోబు గ్రంథము ఒక గొప్పపాఠాన్ని చెబుతుంది. తనకును దేవునికిని వివాదముతీర్చే మధ్యవర్తియుంటే బాగుండునని యోబు కాంక్షించెను (యోబు 23:3; 9;33). ఈ అవసరాన్ని యేసు తీర్చాడని మనం యెరుగుదుము (1తిమో 2:5; 1 యోహాను 2:1; హెబ్రీ 4:14-16). సమాధి యనంతరం జీవనం ఉన్నదా? యని యోబు తలంచాడు (యోబు 14:14). తాను చేసిన బోధవలనను, తానే సమాధిని జయించి లేచుటవలనను పునరుత్థానమున్నదని యేసు నిరూపించాడు (యోహాను 11:25-26; 14:1-6; 1 కొరింథి 15:1-26; కొల 3:4). మనందరివలె యోబుకూడ విరామ

స్థలాన్ని ఒకదాన్ని కాంక్షించాడు (మత్త 11:23-30; హెబ్రీ 4:1-11). ఈ జీవితంయొక్క దుఃఖబాధలనుండి, శ్రమలనుండి మనలను విడిపించే స్థలం అది (ప్రక 21:4-7).

—శేరి హేంప్‌టన్

---

## క్రైస్తవ జీవితము
## *( The Christian Life )*

క్రైస్తవ జీవిత మనగా యేమిటి? దానిని యెవరు జీవించగలరు? దాని ప్రయోజన మేమిటి? అది యెంతకాల ముండును? దానివలన కలుగు మేలేమైనను ఉన్నదా? క్రైస్తవ్యము నెరుగని వారిలో కొందరు అడిగే ప్రశ్నలలో ఇవికొన్ని. ఈ క్లుప్త వ్యాసములో ఈప్రశ్నలకును, యివిగాక మీ మనసులో యున్న మరికొన్ని ప్రశ్నలకును జవాబిచ్చుటకు ప్రయత్నము చేయుదము.

క్లుప్తముగా, క్రైస్తవ జీవితము యేసునందున్న విశ్వాసము, విధేయతలపై ఆధారపడి యున్నది. అది క్రీస్తును వెంబడించుటకు ఒకడు తన జీవితమును సమర్పించుకొనుట. ఒకడు క్రీస్తు జీవితమును మాదిరిగా యుంచుకొని దాని ననుకరించుట అది. ఒకని జీవితములో క్రీస్తునే ముందు ఉంచుట యది.

క్రైస్తవ జీవితము యొక్క భావమును విస్తృత పరచుచు ఈ దిగువ సంగతులను మనసునందుంచుకొన వలెను.

1. క్రైస్తవ జీవితములో విశ్వాసము అవుసరము. ఒకడు దేవుడున్నాడనియు, తన్ను వెదకు వారికి ఆయన ఫలము దయచేయువాడనియు తప్పక నమ్మవలెను (హెబ్రీ 11:6). "మీరు దేవునియందు విశ్వాస ముంచుచున్నారు, నాయందును విశ్వాస ముంచుడి" యని క్రీస్తు చెప్పెను (యోహాను 14:1). ఆయన మరల, "కాగా మీ పాపములలోనే యుండి మీరు చనిపోవుదురని మీతో చెప్పితిని. నేను

ఆయననని మీరు విశ్వసించని యెడల మీరు మీ పాపములలోనే యుండి చనిపోవుదురని వారితో చెప్పెను" (యోహాను 8:24). ఒకడు క్రీస్తును వెంబడించుటకు, ఆయనకు లోబడుటకు, ఆయన కొరకు జీవించుటకు అతడు క్రీస్తునందు తప్పక విశ్వాస ముంచవలెను.

2. క్రైస్తవ జీవితము విధేయతను కోరును. నిజానికి ఒకడు క్రైస్తవుడగుటకు విధేయత అత్యవసరము. అపొస్తలులు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్త ప్రకటించవలెనని క్రీస్తు ఆజ్ఞాపించెను. తరువాత, "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును, నమ్మని వానికి శిక్ష విధింపబడునని" ఆయన చెప్పెను (మార్కు 16:16). పెంతెకొస్తు దినమున ప్రజలు తామేమి చేయవలెనో తెలిసికొనగోరగా, పేతురు "మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" అని వారితో చెప్పెను (అపొ. కా. 2:38). ఆ నాడు విధేయత చూపినవారు క్రైస్తవులయిరి. అయితే ఇంతటితోనే విధేయత ఆగిపోదు. క్రైస్తవులు వాక్యమును బట్టి చేయువారై యుండవలెనని హెచ్చరింప బడిరి (యాకోబు 1:22). వారు విధేయత చూపు బిడ్డలుగా యుండునట్లు నేర్పింపబడినవారు (1 పేతురు 1:14).

3. క్రైస్తవ జీవితము ఒకడు జీవించు జీవిత విధానమై యున్నది. క్రీస్తునకు లోబడువారు ఆయనలోనికి బాప్తిస్మము పొందుదురు. "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిరని మీరెరుగరా?" యని పౌలు ప్రకటించుచున్నాడు (రోమా 6:3). మరల అతడిట్లనుచున్నాడు: "యేసుక్రీస్తునందు మీరందరు విశ్వాసమువలన దేవుని కుమారులై యున్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు (గలతీ 3:26, 27). క్రీస్తులోనికి దేనిద్వారా ఒకడు ప్రవే

శించునో దానిద్వారానే ఆయన శరీరమైన క్రీస్తు సంఘములోనికి ప్రవేశించును (1 కొరింథి 12:13; ఎఫెసీ 1:22, 23). ఒకడు క్రీస్తునం దున్నప్పుడు, ఆయన శరీరమందున్నప్పుడు అతడు క్రైస్తవుడు (అపో. కా. 11:26; 26:28; 1 పేతురు 4:16). క్రైస్తవునిగా ఒకడు మిగిలిన క్రైస్తవులతో సహవాసము కలిగియుండును (అపో. కా. 2:42; రోమా 16:17, 18).

4. క్రైస్తవ జీవితమనగా పవిత్రమైన జీవితము. క్రైస్తవుడు ఈ లోకములో యున్నాడుగాని ఈలోక సంబంధుడుకాడు (యోహాను 17:14). అతని చుట్టుయున్న ప్రజలకంటె అతడు ప్రత్యేకుడు, వేరుగా యున్నవాడు (1 పేతురు 2:9). అతడు సమస్త దుర్నీతినుండి దూర ముగా యుండి పవిత్రముగా యుండవలెను (తీతు 2:14, 1 థెస్స 5:25). భక్తిపూర్వకముగా యుండవలెనని హెచ్చరించుచు పౌలు ఇట్లనుచున్నాడు: "ఏలయనగా సమస్త మనుష్యులకు రక్షణకరమైన దేవుని కృప ప్రత్యక్షమై మనము భక్తిహీనతను, ఇహలోక సంబంధ మైన దురాశలను విసర్జించి...ఈ లోకములో స్వస్థ బుద్ధితోను, నీతి తోను, భక్తితోను బ్రదుకుచుండవలెను" (తీతు 2:11-13).

5. క్రైస్తవ జీవితమనగా పరిచర్యచేయు జీవితము. క్రైస్త వుడు ప్రతిదినము క్రీస్తును వెంబడించవలెను (లూకా 9:23), తన శరీరమును సజీవ యాగముగా అర్పించవలెను (రోమా 12:1, 2). అతడు పవిత్రమును నిష్కళంకమునైన భక్తిని కలిగి యుండవలెను (యాకోబు 1:27), మరియు అతడు ప్రభువునకు పనివాడై యుండ వలెను. పౌలు ఇట్లు ప్రకటించుచున్నాడు: "కాగా నా ప్రియ సహో దరులారా, మీ ప్రయాసము ప్రభువునందు వ్యర్థము కాదని యెరిగి స్థిరులును, కదలనివారును, ప్రభువు కార్యాభివృద్ధియందు ఎప్పటికిని ఆసక్తులునై యుండుడి" (1 కొరింథి 15:5).

6. క్రైస్తవ జీవిత మనగా ఆశీర్వాదములు పొందు జీవితము. క్రీస్తు యొక్క అనుచరుడు దేవుని ఆరాధించు తరుణము కలిగినవాడు (యోహాను 4:24). ప్రభువతనితో యెల్లప్పుడు ఉండువాడనియు, క్రీస్తునందు సమస్తాత్మీయాశీర్వాదములు అతనికి వాగ్దానము చేయబడె ననియు అత డెరిగినవాడు (మత్తయి 28:20, ఎఫెసీ 1:3). అన్నిటికంటె పైగా అతడు నిత్యజీవ నిరీక్షణను కలిగినవాడు. మరణ పర్యంతము నమ్మకముగా యుండుము, నేను నీకు నిత్యజీవ కిరీట మిచ్చెదనని క్రీస్తే చెప్పెను (ప్రకటన 2:10).

మిగతా జీవనవిధానము లన్నిటికంటె క్రైస్తవ జీవితము ఎక్కువ ఆదేశించునట్టిది, ఎక్కువ ఫలించునట్టిది, మిక్కిలి ఆనందకర మైనట్టిది. అది ఒకడు తన జీవితములో యున్న చెడుగు నంతటిని పోగొట్టుకొన జేయునట్టిదియే గాక, మేలైన దానిని చేపట్టుకొని, ఉత్కృష్టమైన సంగతులను అలవరించుకొన జేయునట్టిది. ఒకడు తన జీవితములో ఒక దానికొరకు జీవించుటకు కృషి చేయుటకు చివరిగా మరణించుటకు అవకాశము కల్గించునట్టిది. నీవు దీనిని పరిశోధించి, నీకు నీవే కనుగొనుము.

—జె. సి. ఛోట్

---

## క్రీస్తు సంఘమును పరిశోధించుము

## *( Investigate the Church of Christ )*

1. క్రీస్తు దాన్ని స్థాపించెను. మత్తయి 16:18.
2. క్రీ. శ. 33 లో సంఘము స్థాపింపబడెను. అపొ. కా. 2.
3. అది క్రీస్తు నామమును ధరించును (రోమా 16:16). దాని సభ్యులు క్రైస్తవులు మాత్రమే. అపొ. కా. 11:26.

4. క్రీస్తు దానిని తన స్వరక్తమిచ్చి సంపాదించెను. అపో.కా. 20:28.

5. దాని కొరకు ఆయన మరణించు నంతగా ఆయన దానిని ప్రేమించెను. ఎఫెసీ 5:25.

6. క్రీస్తే దాని శిరస్సు. కొలస్స 1:18.

7. క్రీస్తే దాని రక్షకుడు. ఎఫెసీ 5:23.

8. దాని సభ్యుడగుటకు ఒకడు సువార్తను వినవలెను (రోమా 10:17), విశ్వసించవలెను (హెబ్రీ 11:6), తన పాపముల విషయమై మారుమనస్సు పొందవలెను (లూకా 13:3), క్రీస్తును ఒప్పుకొనవలెను (మత్తయి 10:32), బాప్తిస్మము పొందవలెను (మార్కు 16:16).

9. రక్షించబడిన వారిని ప్రభువు తన సంఘముతో చేర్చును. అపో. కా. 2:47.

10. ఒకే ఒక్క శరీరమున్నది; అదే క్రీస్తు సంఘము. ఎఫెసీ 1:22,23.

11. దాని సభ్యులు ఆరాధనకొరకు ప్రతి ఆదివారమున కూడుకొనవలెను (హెబ్రీ 10:25), దేవునికి స్తుతి కీర్తనలు పాడవలెను (ఎఫెసీ 5:19), ప్రార్థన చేయవలెను (అపో. కా. 2:42), వాక్య పఠనము జరిగించవలెను (2 తిమోతి 2:15), ప్రభు రాత్రి భోజనము జరిగించవలెను (అపో. కా. 20:7) మరియు కానుక లీయవలెను (1 కొరింథి 16:2).

12. దాని సభ్యులు మరణ పర్యంతము నమ్మకముగా యుండి క్రైస్తవ జీవితమును జీవించవలెను (ప్రకటన 2:10).

13. క్రీస్తు తన సంఘము కొరకు మరల వచ్చుచున్నాడు (ఎఫెసీ 2:27).

# జీవపు మాటలు

యేసు దేవుని కుమారుడై యుండెను, అన్ని విషయములలోను తండ్రితో సమానుడై యుండెను. మహిమలోను, శక్తిలోను ఆయన తండ్రితో సమానుడు. అయితే ఆయన దేవుని "నీతిగలదాసుని" వలె యుండుటకు తన్ను తాను తగ్గించుకొనెను. ఆయన తన తండ్రి చిత్తమును నెరవేర్చుటకు లోబడినట్లు ఆయన పలికిన మాటలే మనకు తెలియజేయు చున్నవి. దైవ రక్షకుడే తండ్రి చిత్తమునకు అంతగా లోబడితే మనం దేవునికి ఇంకెంత లోబడి యుండాలి! రోగము వలన మనము కృంగిపోవచ్చు, మరణం మనలను దుఃఖాక్రాంతులుగ చేయవచ్చు, పేదరికం శోధించవచ్చు, విధవరాలి కన్నీరు మన కండ్లనుండి కారవచ్చు; అయితే క్రీస్తు యేసునకు కలిగిన మనస్సే మనము కలిగి యుండేలాగున ప్రయత్నించుదాం. అప్పుడు తండ్రియైన దేవుడు చివరకు మనకు విజయాన్ని దయచేయగలడు !

—జాన్ హిల్.

Regd. No. C-6446/82

*From*
SATYA WAKKU
P.O. Box 80
KAKINADA–533 001

Printed Book only

To
..............................
..............................
..............................
..............................